క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

దౌల్తాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. దౌల్తాబాద్ మండలం గుండేపల్లి గ్రామానికి చెందిన సాయప్ప అనారోగ్యానికి గురయ్యారు. సీఎం ఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయగా.. రూ.1.50 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు చెక్కును బుధవారం జెడ్పీటీసీ బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సాయిరెడ్డి, మహిపాల్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



గంధం ఊరేగింపులో మైనార్టీ నాయకులు, యువకులు

యాలాల: నౌషా బాలేసాబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి జామియా మసీదు నుంచి గంధం ఊరేగింపును నిర్వహించారు. దీపారాధనతో ముగింపు ఉత్సవాలకు మత పెద్దలతో పాటు యువకులు, ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తరలివెళ్లారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

నోటుబుక్కుల పంపిణీ



నోటుబుక్కులతో విద్యార్థులు, సర్పంచ్ తదితరులు

యాలాల: పాఠశాల విద్యార్థులకు అవసరమైన వాటిని సమకూరుస్తానని హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్సిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు సహాయం చేయడమే కాకుండా.. పాఠశాలను దత్తత తీసుకొని అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నగేష్, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, రాంచంద్రారెడ్డి, రమాకాంత్, గ్రామస్తులు చంద్రప్ప తదితరులు ఉన్నారు.

క్రీడా ప్రాంగణానికి స్థలం కేటాయింపు



క్రీడాస్థలం పరిశీలిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి శంకర్

దోమ: క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని సర్పంచ్ మామిళ్ల నర్సింహులు అన్నారు. బుధవారం దోమ మండలం ఊటుపల్లిలో ఫారెస్టు భూమిలో క్రీడా ప్రాంగణానికి ఫారెస్ట్ సెక్షన్ అధికారి శంకర్ స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గ్రామంలో క్రీడా ప్రాంగణానికి స్థలం లేకపోవడం వలన ఇబ్బందులు ఏర్పడ్డాయని, అటవీ భూమిలో స్థలాన్ని కేటాయించడం సంతోషిదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి లాల్యా నాయక్, ఫారెస్ట్ బీట్ అధికారి గౌతమి, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహం ఏర్పాటు చేయాలి



డీసీసీబీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: స్థానికంగా బీసీ బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని పీఎస్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండలంలో జనాభా ప్రకారం ఆశ్రమ పాఠశాలలు కేటాయించాల్సి ఉన్నా.. ఒక్కటి కూడ లేదన్నారు. బీసీ విద్యార్థుల సౌకర్యార్థం ఆశ్రమ పాఠశాలతో పాటు, బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హరి పాల్గొన్నారు.

కరెంటుతో జర భద్రం

- ఏమరుపాటులో ప్రాణాలకే ముప్పు
- వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

దౌల్తాబాద్/దోమ: వర్షాకాలంలో నిత్యం విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇళ్లు, పొలాలు, రహదారులు ఇలా ఎక్కడైనా సరే ప్రమాదాలు పొంచి ఉంటాయని చెప్పక తప్పదు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా నిండు ప్రాణాలు బలికాక తప్పదు. అందుకు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో రైతులు బోరుబావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లతో సాగు చేస్తుంటారు. తెలుసు కదా అని మోటార్లకు, షాటర్లకు చిన్నచిన్న మరమ్మతులు చేసే ప్రయత్నం చేస్తుంటారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు గాలిలో కలిసిపోవడం లాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

మూడింటికే పరిహారం..

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తున్నాయి. కరెంట్ షాక్ వలన మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. వ్యక్తులకు అయితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున పరిహారం చెల్లిస్తాయి.



బోరుమోటారు వద్ద స్టార్టర్

ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవపంచనామ పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశువైద్యుడి పోస్టుమార్టం నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది.

నష్టపరిహారం ఇలా..

విద్యుత్‌తీగలు తెగి కిందపడి, వాటికి తగిలి మనుషులు, పశువులు చనిపోతే పరిహారం ఇస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి మృత్యువాత పడితే నష్టపరిహారం అందుతుంది. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మత్యువాత పడితే చెల్లిస్తారు.

పాటించాల్సినవి..

మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డులను తడవకుండా చూడాలి. మోటార్లు పాడైతే మెకానిక్‌లతోనే మరమ్మతు చేయించాలి. సొంత ప్రయత్నం వద్దు. సర్వీసు వైర్లను మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి ఉండాలి. వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి. సబ్‌మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైరు ఉంటుంది. ఏ కొంచెం వైర్లు తెగి ఉన్నా మోటారు నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం లేకపోలేదు.

జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సొంత ప్రయోగాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. తీగలు తెగి పడినా, కిందకు వేలాడిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

– కిషోర్, విద్యుత్ ఏఈ, దోమ

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

- విద్యార్థులు ఆటలపై మక్కువ చూపాలి
- మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 4, 5వ తరగతి విద్యార్థులకు క్రీడా పాఠశాలల ఎంపికపై పీఈటీ వెంకట్రాములు ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆటలు పిల్లల్లో ఉల్లాసాన్ని పెంచి, చురుగ్గా చదువుకోవడానికి, శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. ఈ క్రీడలతో క్రీడా పాఠశాలలో చదువుకోవడానికి ఉత్తమ విద్యార్థులు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 4వ తరగతి విద్యార్థులు 17 మంది, 5వ తరగతి విద్యార్థులు 19 మంది జిల్లా స్థాయి పోటీలకు సెలెక్ట్ అయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు పురందాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ హెచ్ఎస్‌లో క్రీడా పాఠశాలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఎంఈఓ

అప్పుచేసి 'కంటివెలుగు' నిర్వహించాం

నేటికీ ఒక్కరూపాయి రాలేదు

- సమస్యలు పరిష్కరించని అధికారులు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ
- సమన్వయంతో పనిచేయాలి: డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



సమస్యలపై మాట్లాడుతున్న సభ్యులు

కుల్కచర్ల: అప్పు చేసి కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా రాలేదని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆరోపించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని సమీక్షలు జరిగినా విద్యుత్‌శాఖ ఏఈ హాజరు కాకపోవడమేమిటని ప్రశ్నించారు. నట్టల మందులు వచ్చాయని ప్రకటనలు చేశారు. కానీ.. ఏ ఒక్కరికీ మందులు ఇవ్వలేదని, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల్లో చిన్నారులను చేర్పించడంలో అంగన్‌వాడీలు విఫలమౌతున్నారని సాల్వీడు సర్పంచ్ బాలయ్య సభ దృష్టికి తెచ్చారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కాపాడు కోలేకపోతున్నారని, దీనివెనుక ఉన్న ఆంతర్యమేమిటని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పులేదని ఎంపీటీసీ ఆనందం ఆరోపించారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని చౌడాపూర్ సర్పంచ్ కొత్తరంగారెడ్డి సభలో ప్రస్తావించారు.

సమన్వయంతో..

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రజాప్రతినిధుల సహాయంతో వాటిని పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కరీం, పంచాయతీరాజ్ డీఈ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న పారాయణం



పారాయణం చేస్తున్న గీతా వాహిణి ప్రతినిధులు

అనంతగిరి: గీతా వాహిణి ఆధ్వర్యంలో 7 రోజులుగా భగవద్గీత పారాయణం జరుగుతోంది. బుధవారం వికారాబాద్ పట్టణం సాయిబాబా ఆలయంలో జరిగిన పారాయణంలో కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ శ్మశానవాటిక స్థలంలో పనులు ఆపాలి

కుల్కచర్ల: శ్మశానవాటిక స్థలంలో చేపడుతున్న పనులను నిలిపివేయాలని మైనార్టీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ నాగవేణికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. స్థానిక అంగడిబజార్ కాలనీ శివారులో విత్తనశుద్ధి కేంద్రం సమీపాన చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను నిలిపివేసి, తమకు చెందిన స్థలాన్ని మొత్తం చూపించాలని, అంతవరకు పనులు నిలిపివేయాలని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెండు ఎకరాల స్థలం కేటాయించారని, ఆ స్థలాన్ని పరిరక్షించి, తమకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రుక్కు, జాఫర్, జావీద్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

◆ మినీ కిట్స్‌ను వినియోగించుకోవాలి

బంట్వారం: నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద ఉచితంగా పంపిణీ చేస్తున్న రెడ్ గ్రాం మినీ కిట్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ గీత అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో ఆమె రైతులకు మినీ కిట్స్‌ను అందజేసి మాట్లాడారు. మండలానికి 22 క్వింటాళ్ల మినీ కిట్స్ వచ్చాయన్నారు. పీఆర్‌జీ–176, ఎల్ఆర్‌జీ–52, జీబీజీ–01, ఎల్ఆర్‌జీ–52 రకం రెడ్ గ్రాం మినీ కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఒక్కో కిట్ నాలుగు కిలోలు ఉంటుందని, నేలల సారవంతాన్ని బట్టి కిట్స్ సరఫరా అవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏఈఓ స్వాతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో పాడిపశువు మృతి



గేదే కళేబరం వద్ద రోదిస్తున్న రైతు

అనంతగిరి: వికారాబాద్ మండలం రాళ్ల చిట్టంపల్లిలో విద్యుత్ షాక్‌తో పాడి పశువు మృతి చెందింది. పీలారం అన్వర్‌పాషకు చెందిన బర్రె పొలం వద్ద మేతమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి విద్యుదాఘాతంతో మృత్యువాత పడిందని బాధిత రైతు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయకపోవడంతో ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. రూ.80వేలు అప్పు చేసి కొన్న గేదే మృతిచెందిందని రోదిస్తూ.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

◆ ఏఓగా తిప్పస్వామి



బొంరాస్‌పేట: మండల వ్యవసాయ అధికారిగా తిప్పస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జూన్ మూడో వారంలో బదిలీపై వచ్చిన ఏఓ అనురాధ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తిప్పస్వామి వచ్చారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని పోస్టాఫీసు కార్యాలయంలో నూతనంగా ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయని సబ్ పోస్ట్ మాస్టర్ మల్లికార్జున్ తెలిపారు. కార్డు దారులు.. ఆధార్‌లో తప్పొప్పులను సరిచేసుకునేందుకు, చిరునామా, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ తదితర అంశాల మార్పు కోసం కార్యాలయంలో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగా ఆధార్ తీసుకునేందుకు పుట్టిన తేది సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకు రావాలని చెప్పారు.

ధారూరు సీఐగా రామకృష్ణ



ధారూరు: ధారూరు సీఐగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పనిచేసిన రామకృష్ణ వికారాబాద్ జిల్లా డీసీఆర్‌బీకి వచ్చారు. డీసీఆర్‌బీ నుంచి ధారూరు సర్కిల్ సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన సీఐ అప్పయ్యను డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మర్పల్లి: బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మర్పల్లి సీహెచ్ఎస్ (ఆసుపత్రి) కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్, ప్రధానకార్యదర్శిగా రాథోడ్ వెంకట్, కోశాధికారిగా నిర్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అనీల్, మధు, రవి కిరణ్, రేణుక, చంద్రకళ, లలిత, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు..

బంట్వారం: హరితహారంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఈజీఎస్ ఏపీఓ సుధాకర్ అన్నారు. హరితహారంపై బుధవారం ఈజీఎస్ కార్యాలయంలో ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి జీపీ పరిధిలో ఐదు వేల చొప్పున మొక్కలు నాటాలన్నారు. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇదే అనువుగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 16,180, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

సంకల్పబలంతో బలోపేతం

- సర్కారు బడులపై భరోసా కల్పించాలి
- ఉపాధ్యాయులతో విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి



చంద్రాయన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

మోమిన్‌పేట: ఉపాధ్యాయుల్లో సంకల్ప బలం ఉంటే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండలం చక్రంపల్లి, చంద్రాయన్‌పల్లి ప్రాథమిక పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆమె సందర్శించి మాట్లాడారు. బోధనా సిబ్బంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టకుండా చూడాలని, అందుకు సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించాలని సూచించారు. అప్పుడే ఇటు వైపు మొగ్గుచూపుతారని ఆమె పేర్కొన్నారు.

గట్టిగా చదివించాలి

మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తుందని, ఇక మిగిలింది విద్యార్థులు ప్రైవేటు బడుల వైపు వెళ్లకుండా.. ఉపాధ్యాయ బృందం ప్రభుత్వ విద్యాలయాలకు రప్పించే ప్రయత్నం చేయాలని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో పఠనోత్సవంలో భాగంగా పిల్లలతో గట్టిగా చదివించాలని, రాయడం, చదవడంలో నిష్ణాతులను చేయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. కస్తూర్బాలో 10లో ఉత్తీర్ణత శాతం ఎందుకు తగ్గిందని ఉపాధ్యాయులను ఆమె ప్రశ్నించారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. ఇకపై ఉత్తీర్ణత శాతం తగ్గితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు విద్యార్థులతో ముచ్చటించారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు బిచ్చయ్య, పద్మారావు తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



రుక్మాపూర్ పాఠశాల హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

పెద్దేముల్: ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, మంబాపూర్, రుక్మాపూర్, మదనంతపూర్, ఖాజాపూర్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిష్టర్, లైబ్రరీ రీడింగ్ ఇంప్రూవ్‌మెంట్ పోగ్రాం తదితర అంశాలను పరిశీలించి మాట్లాడారు. టీచర్లు సమయపాలన పాటించాలని, ఇకపై నిత్యం సోదాలు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చెప్పాలని, వర్షాలు ప్రారంభం అయినందున మధ్యాహ్న భోజనంపై కేర్ తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థకు చేరి, కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న మదనంతపూర్ పాఠశాల విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంఈఓ తెలిపారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రత్నం తదితరులు

నవాబుపేట: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. నవాబుపేట మండలం గంగ్యాడ, నారెగూడ, పూలపల్లి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపాల్, సయ్యద్‌గౌస్, సాయికుమార్, రాములు, శేకర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పద్మరావ్, గాలయ్య, మల్లేషం, శేకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు తప్పనిసరి



మరుగుదొడ్డి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యాలాల: ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీఓ యాదయ్య అన్నారు. బుధవారం కోకట్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. ప్రతి పంచాయతీలో మరుగుదొడ్ల వాడకం పెరిగేలా స్థానిక సర్పంచ్‌లు చొరవచూపాలని చెప్పారు. ఆయన వెంట ఏపీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామస్తులు శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పరిగి: తమ సమస్యలు పరిష్కరించాలని సహకార బ్యాంకు ఉద్యోగులు బుధవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పేరుకు ఉద్యోగులమే అయినా సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం, బ్యాంకులో రెండు అంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. సహకార బ్యాంకును ఇతర బ్యాంకుల్లో విలీనం చేయడం, సరిపడా మూలధనాన్ని సమకూర్చడం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటయ్య, బాలకృష్ణ, సురేష్, రాజీవ్‌నాయక్, సవిత, కలీం, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో బుధవారం ఆర్ఎస్ఎస్, హిందూవాహిని శాఖల ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాలమూరు విభాగ్ సేవా ప్రముఖ్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. గురు పూజోత్సవాన్ని భక్తిభావంతో జరుపుకోవాలని, తల్లిదండ్రుల తరువాత గురువును పూజించాలని సూచించారు. జీవన విధానాన్ని, సమాజంలో మెలిగే పద్ధతులను వివరిస్తూ వ్యక్తి జీవనశైలిని గురువు రూపొందిస్తారని, వ్యాస మహర్షిని ప్రపంచానికి గురువుగా భావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంఘ సేవకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కనీస వేతనం రూ.19.5వేలు అమలు చేయాలి
- పంచాయతీ కార్మికుల డిమాండ్
- ఎంపీడీఓలకు సమ్మెనోటీసులు అందజేత



పరిగి: ఎంపీడీఓకు సమ్మెనోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

పరిగి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిలా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ శేషగిరి శర్మకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు గురువారం నుంచి సమ్మె చేస్తున్నట్లు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమ్మె తలపెట్టామని, పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.19.5వేలు ఇవ్వాలని కోరారు. ఈసీఎస్, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 51ని రద్దు చేసి, కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జీఓ 60 ప్రకారం ప్రతి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రయ్య, దస్తయ్య, బాలయ్య, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నుంచి సమ్మె చేస్తున్నట్లు జీపీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు సాయిలు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ తిరుమలస్వామికి సమ్మె నోటీసు అందజేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధులకు రామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిదాస్, రాములు, మల్కప్ప, దస్తప్ప, సాయప్ప, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.